క్లుప్తంగా

గృహోపయోగ వస్తువుల తయారీపై సర్టిఫికెట్ కోర్స్



సర్టిఫికెట్ కోర్సు కరపత్రం విడుదల చేసిన డిగ్రీ కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గృహోపయోగ వస్తువుల తయారీ విధానంపై సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు తెలిపారు. కోర్సు ప్రారంభ సమావేశానికి గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ గృహోపయోగ వస్తువుల తయారీ విధానంపై అవగాహన అవసరమని, తద్వారా భవిష్యత్తులో వ్యాపారవేత్తలుగా ఎదగడానికి స్ఫూర్తి పొందుతారని చెప్పారు. కోర్స్ కోఆర్డినేటర్ రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకుడు కె.రమేష్ మాట్లాడుతూ ఈ కోర్సులో భాగంగా ముందుగా బాత్ సోప్, ఫినాయిల్ తయారీ విధానాన్ని నేర్పిస్తారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, వి.వెంకట్ రావు, ఎం విజయ్ కుమార్, టీవీఎస్ పద్మావతి, ఎం కృష్ణ చైతన్య, పీఆర్ కావ్యశ్రీ, ఎస్ సుస్వలత, డి.సుజాత పాల్గొన్నారు.

ప్రతి బిడ్డకూ పోలియో చుక్కలు వేయాలి

ఏలూరు(మెట్రో): పుట్టిన ప్రతి బిడ్డకూ పోలియో చుక్కలు వేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశపు హాలులో గురువారం పిల్లలకు ఎంపీ, కలెక్టర్ తోపాటు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ నాగేశ్వరరావు, జిల్లా ఆసుపత్రిసేవల సమన్వయాధికారి బీపాల్ సతీష్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సీహెచ్ సుధాకర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం శశిధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను కళాశాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. కళాశాలకు సొంత భవనాల నిర్మాణం, ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుపైనా చర్చించారు. ఎంపీని కలిసిన వారిలో ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వర రావు, అధ్యాపకులు వి.వెంకట్ రావు ఉన్నారు.

బోధన లేక విద్యార్థుల వేదన

- వేధిస్తున్న టీచర్ల కొరత
- 3 పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టుల టీచర్లే లేరు
- ఉన్నత పాఠశాలల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌ఏలూ లేరు
- నగరపాలక సంస్థ పాఠశాలల్లో దుస్థితి



పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైఎస్సార్ సీపీ హయాంలో విద్యారంగ అభివృద్ధి కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల అమలుతో నగరపాలక సంస్థ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పెరిగిన విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరింత అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆయా పాఠశాలల వైపు కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యాడు. నగరపాలక సంస్థ పాఠశాలల్లో అవసరమైన మేరకు ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. నగరపాలక సంస్థ పాలన నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పాలన పాఠశాల విద్యాశాఖకు బదిలీ అయి చాలా కాలమైనప్పటికీ పాఠశాల విద్యాశాఖ నగరంలోని పాఠశాలలను పట్టించుకున్న దాఖలాలు లేవు. నగరంలోని అనేక పాఠశాలలను అవసరమైన సబ్జెక్టు టీచర్ల కొరత వేధిస్తోంది. దీనిపై దాదాపు ఉపాధ్యాయ సంఘాలన్నీ వంతుల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ పాఠశాల విద్యాశాఖలో చలనం లేదు. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోతుందనే ఆందోళన తల్లిదండ్రుల్లో వ్యక్తమౌతోంది.

దిక్కులు చూసే పరిస్థితి

నగరంలో సంఖ్యాపరంగా కొన్ని పాఠశాలల్లో టీచర్ల కొరత తక్కువగా ఉన్నా.. మూడు పాఠశాలల్లో మాత్రం సబ్జెక్టు టీచర్లు కూడా లేక విద్యార్థులు దిక్కులు చూసే పరిస్థితి కనిపిస్తోంది. తూర్పువీధి ముస్లిం బాలుర నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానమైన ఉర్దూ, తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, గణితం సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్ల అవసరం ఉంది. స్థానిక దక్షిణపు వీధి నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాల, పవర్‌పేట నగరపాల ప్రాథమికోన్నత పాఠశాలలకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం స్కూల్ అసిస్టెంట్లు కావాల్సి ఉంది.

స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌ఏలూ లేరు

విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రతి ఉన్నత పాఠశాలకూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించేందుకు స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లు ఉండాలి. అయితే నగరంలోని ఏడు ఉన్నత పాఠశాలల్లో ఏ ఒక్క పాఠశాలలోనూ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు లేరు. ఈదర సుబ్బమ్మదేవి స్కూల్, కస్తూరిబా బాలికోన్నత పాఠశాల, బాలగంగాధర్ తిలక్ ఉన్నత పాఠశాల, ఏఆర్‌డీజీకే ఉన్నత పాఠశాల, గాంధీనగర్ ఉన్నత పాఠశాల, ఎంఏకేఏ ఉన్నత పాఠశాల, ఈఎస్‌ఎంపీ హైస్కూళ్లకు స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లను మంజూరు చేయాల్సి ఉంది.

జీపీఎఫ్ ఖాతాలు తెరవాలి

నగరపాలక సంస్థ పాఠశాలల ఉపాధ్యాయుల్లో దాదాపు 70 మంది ప్రావిడెంట్ ఫండ్ ప్రశ్నార్థకంగా మారింది. వీరంతా 2004వ సంవత్సరానికి ముందు ఉద్యోగాల్లో ప్రవేశించి పాత పెన్షన్ పథకంలో ఉన్న వారే. 2023వ సంవత్సరంలో మున్సిపల్ పాఠశాలల యాజమాన్యం పాఠశాల విద్యాశాఖకు బదిలీ అయిన నేపథ్యంలో నగరపాలక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నేటికీ నగరపాలక సంస్థ, వారి జీతాల నుంచి ప్రావిడెంట్ ఫండ్ నిమిత్తం మినహాయించిన మొత్తం ఇప్పుడేమైందో తెలియక మథన పడుతున్నారు. రెండేళ్లుగా పాఠశాల విద్యాశాఖ వీరి జీతాల నుంచి పీఎఫ్ నిమిత్తం ఎటువంటి మినహాయింపులు చేయడం లేదు. దీంతో ఇప్పటివరకు నగర పాలక సంస్థ ఒక్కొక్కరి జీతాల నుంచి పీఎఫ్ నిమిత్తం మినహాయించిన సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు ఏమౌతాయోననే ప్రశ్న వారిని వేధిస్తోంది. దానికితోడు వారు తమకు అవసరమైనప్పుడు రుణాలు పొందాలంటే పొందలేని పరిస్థితి నెలకొంది. వెంటనే తమకు జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని ఈ 70 మంది ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలి



నగరంలోని వివిధ పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు బోధనావకాశాలు సన్నగిల్లుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులపై పని ఒత్తిడి మరింతగా పెరుగుతోంది. ఈ కొరత ఉత్తీర్ణత శాతంపై ప్రభావం చూపనుంది. అదే జరిగితే దానికి ఉపాధ్యాయులనే బాధ్యులను చేసే ప్రమాదం ఉంది. విద్యాశాఖాధికారులు యుద్ధ ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలి.

– అబ్బుదాసరి శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి

ఆ సొమ్ము ఉపయోగపడడం లేదు



పీఎఫ్ రూపంలో దాచుకున్న సొమ్ము మా అవసరానికి ఉపయోగపడడం లేదు. పాఠశాల యాజమాన్యం మారిన అనంతరం మా పీఎఫ్ ఖాతాలను జీపీఎఫ్ ఖాతాలకు మార్చకపోవడం వల్ల గత 2023 నుంచి మా జీతాల నుంచి పీఎఫ్ మినహాయింపులు జరగడం లేదు. దీనివల్ల ఉద్యోగ విరమణ చేసే సమయంలో మాకు కలిగే ప్రయోజనాల్లో కోతపడే ప్రమాదం ఉందనే ఆందోళన కలుగుతోంది.

– టి.అమర్ డే, స్కూల్ అసిస్టెంట్ దక్షిణపు వీధి యూపీ స్కూల్

విద్యార్థులు, యువతలో మార్పు రావాలి



శిక్షణలో మాట్లాడుతున్న లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు, యువతలో మార్పు తీసుకువచ్చే విధంగా ఉపాధ్యాయుల బోధన కొనసాగాలని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ లయన్స్ సంస్థ ప్రతిష్ఠాత్మక క్వెస్ట్ కార్యక్రమంపై స్థానిక గ్రీన్ సిటీలో ఉన్న లయన్ డిస్ట్రిక్ట్ లీడర్‌షిప్ ఇనిస్టిట్యూట్‌లో ఉపాధ్యాయులకు గురువారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వేణుబాబు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. క్వెస్ట్ ట్రైనర్ కె.లక్ష్మీమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో మానసిక వికాసం, భావోద్వేగాలను నియంత్రించుకోవడం, కుటుంబ బాంధవ్యాలను మెరుగుపరుచుకోవడం తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జింగెల్ బెల్స్ పాఠశాల, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. లయన్ జిల్లా క్వెస్ట్ చైర్మన్ వి.సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా నాయకులు ఎం శ్రీహరి, వి. రామారావు, ఎల్ వెంకటేశ్వరావు, రీజియన్ చైర్మన్ ఎం కృష్ణమోహన్, జోన్ చైర్‌పర్సన్ డి. సరస్వతి, ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి ఐక్యరాజ్య సమితి కృషి శ్లాఘనీయం



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రపంచ శాంతి కోసం ఐక్యరాజ్య సమితి చేస్తున్న కృషి శ్లాఘనీయమని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియ క్రిస్టియ అన్నారు. స్థానిక సెయింట్ థెరిసా మహిళా కళాశాలలో సాంఘిక శాస్త్రాల విభాగాధిపతి పి.రత్నమేరీ ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పీవీ రమణ, చైర్‌పర్సన్ బి.వెంకటేశ్వరరావు, డి.హేమ సుందర్ పాల్గొని ఐక్యరాజ్య సమితి ఆవశ్యకతను వివరించారు. ప్రపంచ శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్యసమితి పాత్ర అనే అంశంపై వాతావరణ మార్పు, లింగ సమానత్వం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు వంటి ముఖ్యమైన ప్రపంచ సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తీకరించారు. విద్యార్థినులు ఐక్యరాజ్యసమితి ప్రధాన అంగాలు, ఐక్యరాజ్యసమితి లక్ష్యాలు, ఆశయాలు, శాంతిభద్రతలు, రష్యా ఉక్రెయిన్ వివాదం, ఇజ్రాయిల్ – పాలస్తీనా యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య ఉన్న కాశ్మీర్ సమస్యపై ఉపన్యసించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు ఆర్ చిట్టమ్మ ప్రపంచ శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్యసమితి పాత్ర అనే అంశంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు హేలాపురి లయన్స్ క్లబ్ సహకారంతో ప్రిన్సిపాల్ మెర్సీ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇ.జ్యోతికుమారి, అప్లైడ్ సైన్స్ శాఖాధిపతి పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల తనిఖీ



కొత్తబస్టాండ్ వద్ద మోటారు సైకిళ్ల తనిఖీ చేస్తున్న సీఐ కోటేశ్వరరావు

ఏలూరు టౌన్: ద్విచక్రవాహన చోదకులు విధిగా డ్రైవింగ్ లైసెన్సు, ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు కొత్తబస్టాండ్, సత్రంపాడు ప్రాంతంలో సీఐ కోటేశ్వరరావు, ఎస్సై రాంబాబు మోటారు సైకిళ్ల తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కొమడవోలు – ఆటోనగర్ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్, కొమరవోలు, తూర్పు లాకులు, సాయినగర్ లైన్‌లలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ వి.శ్రీలత తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

త్రో బాల్ పోటీలకు కొప్పాక విద్యార్థులు



త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

పెదవేగి : రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు కొప్పాక విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అండర్–14, –17 బాల బాలికల త్రో బాల్ పోటీల్లో కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కె.భువనేశ్వరి, పి.నాగదీప్తి, ఇ.బాల మణికంఠ, జె.వెంకట్, జె.ధనుష్, పి.గౌరీ దేవి, ఎన్ లక్ష్మీ చరణ్య, పి.తరుణ్ శ్రీరామ్, ఎన్ అభిషేక్ ఎంపికైనట్టు హెచ్‌ఎం ఆర్ శైలజ తెలిపారు. క్రీడాకారులను, పీడీ ఎం శ్రీనివాసును హెచ్‌ఎం, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేసిన కార్మికులు

ఏలూరు (టూటౌన్) : కార్మిక హక్కుల పరిరక్షణ దినంగా ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ దినంగా ఈనెల 31న నిర్వహించే ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరవరావు పిలుపు నిచ్చారు. స్థానిక కోటదిబ్బలోని ఎస్‌ఆర్ ఒకటి వద్ద ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత 105 సంవత్సరాలుగా భారతదేశ కార్మిక వర్గానికి ఉద్యోగ వర్గానికి అనేక ఉద్యమాలు పోరాటాల ద్వారా 44 కేంద్ర కార్మిక చట్టాలను సాధించిన ఘనత ఏఐటీయూసీకి ఉందని చెప్పారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.భరత్ లోమి, ఎస్‌ఎంవీ సుబ్బారావు, ఎస్‌కే అలీ, బీకే దుర్గారావు, ఎం ఆదినారాయణ, ఆర్ అప్పారావు, వాడపల్లి వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎం సయ్యద్ బాజీ, ఎస్ గౌరీ శంకర్, ఎన్ అశోక్, టి.శ్రీనివాసరావు, ఎస్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వాసిరెడ్డి పద్మ వ్యాఖ్యలపై ఆగ్రహం



మాట్లాడుతున్న రామరాజు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి వాసిరెడ్డి పద్మకు లేదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కొల్లేరు నాయకులు మోరు రామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అధికార ప్రతినిధిగా, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా అత్యున్నత స్థానం కల్పించిన మాజీ ముఖ్యమంత్రిని విమర్శించిన వాసిరెడ్డి పద్మ లాంటి వ్యక్తి రాజకీయాల్లో తగదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా ఎన్నో అముల చేసి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడిచి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిపై రాజకీయంగా చౌకబారు అపోహలు సృష్టించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కొఠారు కుటుంబం విలువలకు, విశ్వసనీయతకు, నిలువెత్తు నిదర్శనమని వివరించారు. ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని, అనంతరం ప్రజా సమస్యలు పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలని హితవు పలికారు.ఆయన వెంట మోర్ విజయ్ ఉన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ



మురుగు నీటి ప్రదేశాల్లో గంబూషియా చేపలను వదులుతున్న వైద్యాధికారిణి శ్రీలక్ష్మి

భీమడోలు: గంబూషియా చేప పిల్లలను మురుగు కాల్వలో వదలడం ద్వారా దోమల నివారణ సాధ్యమని గుండుగొలను వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రీలక్ష్మి అన్నారు. జిల్లా మలేరియా విభాగం అధికారి ప్రసాద్ సూచనల మేరకు గురువారం భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లో నీరు నిల్వ ప్రాంతాల్లో ఆమె గంబూషియా చేప పిల్లలను వదిలారు. మురుగు నీటి నిల్వలపై దోమల లార్వా వృద్ధి చెందుతుందని, తద్వారా దోమల ప్రబలి ప్రజలు అనారోగ్యంబారిన పడుతున్నారని ఆమె చెప్పారు. మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా ముందస్తుగా మురుగునీటి ప్రదేశాల్లో గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల లార్వా పూర్తి నిర్మూలించవచ్చని తెలిపారు. ప్రజలంతా ప్రతి శుక్రవారం తమ ఇంటి వద్ద నిల్వ నీటిని తొలగించుకోవాలని సూచించారు. ప్రజలంతా వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలని కోరారు. పీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో డెంగీ, మలేరియాలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు కేవీఆర్ తనూజ, సీహెచ్‌ఓ ఇందిర, ఎంపీహెచ్‌ఎస్ రామకృష్ణ, ఏఎన్‌ఎంలు రమేష్, మురళీ, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్



కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్ చేసిన పెదపాడు పోలీసులు

పెదపాడు : కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కట్టా శారధా సతీష్ తెలిపారు. పెదపాడు మండలంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోళ్ల వ్యర్థాల వాహనాన్ని గుర్తించామని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

కోళ్ల వ్యర్థాల కేసులో ముగ్గురి అరెస్ట్

దెందులూరు: కోళ్ల వ్యర్థాను చేపల చెరువులకు వాహనాల ద్వారా సరఫరా చేస్తున్న కేసులో ముగ్గురిని అరెస్ట్ చేశామని ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. గురువారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలంలోని గంగన్నగూడెం వాగు వద్ద జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న కేసులో మూడు వాహనాలు సీజ్ చేసి, ఎనిమిది మంది నిందితులకు ఐదుగురిని ఇటీవల అరెస్ట్ చేశామని తెలిపారు. మిగిలిన ముగ్గురిని త్వరలో కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై వివరించారు.

బాణసంచా స్వాధీనం



అప్పనవీడులో స్వాధీనం చేసుకున్న బాణ సంచా

పెదపాడు : మండలంలోని అప్పనవీడులో నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. పెదవేగి : అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

బాణసంచా సీజ్

పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన కొనకళ్ల వెంకటకృష్ణ వేణు అనే వ్యక్తి నుంచి సుమారు రూ.20 వేల విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	17
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	17

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	29
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – తిరుపతి	16.00	4830	12

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమోటాలు	40–46	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	50	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	72	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40–64	ములక్కాడలు	07,10
బెండకాయలు	52	కంద	60
పచ్చిమిర్చి	40–48	బీట్‌రూట్	38–48
కాకర కాయలు	42–52	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	58	అల్లం	80
క్యాబేజీ	32–36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	50–60	పాలకూర	12
దొండకాయలు	38	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	38,50,56	గోంగూర	07
గోరుచిక్కుడు	50	పుదీనా	05
దోసకాయలు	36–48	బఠాణీ	--
ఆనబకాయ (1)	30–40	క్యాప్సికమ్	80–92
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36